

విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని బుధవారం ప్రాజెక్ట్ ఉద్యోగులు, కార్మికులు శ్రమించి పునరుద్ధరించారు.టిఫి డ్యామ్ వద్ద సొరంగ మార్గం వద్ద జాలి గేట్ పడి పోవడంతో గత నాలుగు రోజులుగా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిన విషయం విధితమే. దీంతో ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు, కార్మికులు రాత్రి పగలు కష్టించి విద్యుత్ ఉత్పాదనకు ఆటంకం లేకుండా పునరుద్ధరించారు. మిగిలిన రెండు జనరేటర్లు సైతం వినియోగంలోకి తీసుకుని వస్తామని ప్రాజెక్ట్ ఎస్ఈ కెవి నాగేశ్వరరావు తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

గ్యాస్ భారం రూ.4కోట్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ: నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న కుటుంబాలపై కేంద్రం తాజాగా మళ్లీ గ్యాస్ భారం మోపింది. పెంచిన గ్యాస్ ధరలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 పెంచడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 8.20 లక్షల మంది వినియోగదారులపై నెలకు రూ.4 కోట్ల అదనపు భారం పడింది. ఈ ధరల ప్రకారం ఏడాది భారం రూ.48 కోట్లు ఉంటుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 14.2 కిలోల గ్యాస్ వినియోగదారులు 13,67,486 మంది ఉన్నారు. వీరిలో ప్రతి నెల బుక్ చేసుకునేవారు 8.20 లక్షల మంది ఉంటారు. ప్రస్తుత గ్యాస్ ధర రూ.1061 నుంచి రూ.1111కి పెరిగింది. విశాఖపట్నం జిల్లాలో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి తదితర కంపెనీల గ్యాస్ కనెక్షన్లు 13.67 లక్షలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో సిలిండర్ వినియోగం తక్కువ. గ్రామీణ ప్రాంతంలో మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి గ్యాస్ తీసుకుంటారు. ప్రతినెలా తీసుకొనే గ్యాస్ వినియోగదారులు 8.20 లక్షల మందిపై పెంచిన యాభై రూపాయల ప్రకారం నెలకు రూ.4 కోట్లు భారం పడుతుంది. గ్యాస్ డెలివరీ బాయ్‌కి ఇచ్చినది కాకుండా ప్రస్తుతం రూ.1061 చెల్లిస్తున్న వినియోగదారుడు ఇక నుంచి రూ.1111 చెల్లించాల్సి ఉంటుంది.

గ్యాస్ సబ్సిడీని (నగదు బదిలీ కింద) నేరుగా వినియోగదారుని ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా పెంచిన ధర ప్రకారం రాయితీ ధర పెంచి వినియోగదారునికి చెల్లించడంలేదు. వినియోగదారుని ఖాతాల్లో కేవలం రూ.3.95 మాత్రం వేసి చేతులు దులుపుకుంటోంది. పెంచుతున్న ధరలకు అనుగుణంగా రాయితీ పెంచకపోవడంతో భారమంతా వినియోగదారునిపైనే పడుతోంది. 2020 జూన్ నాటికి రూ.600 ఉన్న గ్యాస్ ధర తాజాగా రూ.1111 కి చేరింది.



2020 జూన్ నుంచి పెరిగిన డొమెస్టిక్ గ్యాస్ ధరలు

2020 జూన్ రూ.600
2020 నవంబరు రూ.620
2020 డిసెంబరు రూ.702
2021 ఫిబ్రవరి రూ.727
2021 మే రూ.830
2021 జులై రూ.843
2021 సెప్టెంబరు రూ.893
2022 జనవరి రూ.908
2022 మార్చి రూ.958
2022 మే 5 రూ.1008
2022 ఆగ్టు రూ.1061
2023 మార్చి రూ.1111

వాణిజ్య సిలిండర్‌పైనా భారీ పెంపు

గృహ వినియోగ సిలిండర్‌తో పాటు వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కిలోల సిలిండర్ ధరను ఒకేసారి రూ.350 పెంచారు. వాణిజ్య సిలిండర్ ధర పెరగడంతో చిన్న పెద్ద హోటలో తినుబండార ధరలు బాగా పెరిగే అవకాశముంది. పెరిగిన ధరలపై వామపక్షాలు బగ్గుమన్నాయి. గ్యాస్ ధరలు పెంపును నిరసిస్తూ నగరంలో ఆందోళన చేపట్టాయి.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి పాడేరు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రు.50, వాణిజ్య సిలెండర్ రు.350 పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపు నిచ్చారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు పెంచడం దారుణమని దుయ్యబట్టారు. 3 సంవత్సరాల క్రితం వరకు రు.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రు.1155కు పెరిగిందని, ప్రభుత్వం సబ్సిడీ జమలు రెండు సంవత్సరాల నుండి నిలిపి వేసిందని తెలిపారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ క్రింద ఇచ్చే సిలెండర్ల సంఖ్య కుదించారన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్య తరగతి ప్రజలపై దాడని ఆయన ధ్వజమెత్తారు. వాణిజ్య సిలెండరు ఒక్కసారిగా రు.350 పెంచడంతో స్వీయ ఉపాధి పొందుతున్న, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన కేంద్ర ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండులా భారాలు మోపడం సిగ్గు చేటని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతున్నారన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెంచిన ధర ఉపసంహరించే వరకు ఎక్కడికక్కడ నిరసనలు చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

ఎన్నికల కోడ్ దృష్ట్యా..

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నామని ఎంపీడీవో కిరణ్ కుమార్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన మేరకు బుధవారం సమావేశం మందిరంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తేదీని ఖరారు చేసి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు సమావేశం ఉందని ఆహ్వాన పత్రం ఎందుకు పంపారని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. పలువురు అసహనం వ్యక్తం చేస్తూ వెళ్లి పోయారు.

కాంగ్రెస్ మండల జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: కాంగ్రెస్ పార్టీ మండల నూతన జాయింట్ సెక్రెటరీగా శీలంగొంది గ్రామానికి చెందిన బడ్నాయిని లక్ష్మణ్‌ను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగ చైర్మన్ పి శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అధిష్టానం ఎప్పుడు గుర్తుంచుకుంటుందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన జాయింట్ సెక్రెటరీ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జే.వెంకటబాబు, నాయకులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, బాలకృష్ణ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండల కేంద్రంలోని ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్, జిల్లా కార్యదర్శి కే.రఘునాథ్‌ల ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎల్ నారాయణరావును, ప్రధాన కార్యదర్శిగా శెట్టి బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా టి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీరామ్, జి.కాంతమ్మ, కోశాధికారిగా కే.ఆనందరావు, కార్యదర్శులుగా కె.ప్రసాద్, వి.మల్లయ్య, కె.రాజారావు, ఎం.రామకృష్ణ, ఎం.మోహన్, బి.శ్రావణ్ కుమార్, కె బాబ్జి, జి.భులక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.కోగేష్, కే సీతన్న, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.బాబూరావు, ఎస్ కన్నయ్య, పి.చంద్రశేఖర్, ఎం.పార్వతి, పి.అర్జున్, మహిళా అధ్యక్షురాలుగా ఆర్.పార్వతమ్మ, సిపిఎస్ కన్వీనర్‌గా జి.దుక్కులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన నారాయణ, బాలకృష్ణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు.



నారాయణ



బాలకృష్ణ

3న కాఫీ బహిరంగ వేలం

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:- విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ ఆద్వర్యంలో ఈనెల 3న మధ్యాహ్నం 3 గంటలకు కాఫీ బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడేరు కలెక్టరేట్ ఆవరణలో జరిగే ఈ వేలంలో ఆసక్తిదారులు పాల్గొని కాఫీని కొనుగోలు చేయవచ్చుని కలెక్టర్ తెలిపారు. మాక్స్ ఆధీనంలో 135.25 మెట్రిక్ టన్నుల కాఫీ పార్చ్మెంట్, 17.60 మెట్రిక్ టన్నుల కాఫీ ఫ్లోట్ చెర్రీ స్టాక్‌కు గాను ఐదు వేలు చెల్లించి వేలంలో పాల్గొన వచ్చని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు చింతపల్లి పల్పింగ్ యూనిట్ వద్ద స్టాకును పరిశీలించు కోవచ్చన్నారు.నియమ, నిబంధనలు, సెక్యూరిటి డిపాజిట్ వివరాలకు పోన్: 7569118491, 9440803572 నెంబర్లలో సంప్రదిం చవచ్చని సూచించారు.

ఉచిత బియ్యానికి నగదు తీసుకుంటే చర్యలు

సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు:ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆర్హులకు ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యానికి కొన్ని ప్రాంతాల్లో ఒక రూపాయి వసూలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని తహశీల్దార్లు, ఎఎస్ఓలు, సిఎస్ డిటిలు అప్రమత్తంగా ఉండి అటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని జెసి సూచించారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహిస్తోందని, సర్వేలో డబ్బులు వసూలు చేసినట్లు ప్రజలు ఆరోపిస్తే తీవ్రంగా పరిగణించటంతో పాటు చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఉచితంగానే బియ్యం సరఫరా చేస్తున్నందున ఒక్క రూపాయి కూడా వసూలు చేయరాదని, లబ్ధిదారులు ఈ విషయం గమనించి డబ్బులు ఇవ్వరాదని జెసి సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వై.విల్సన్ బాబు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో బుధవారం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సొర్లం రాజబాబు ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన విల్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో యుటిఎఫ్ లక్షా 30 వేల సభ్యత్వం కలిగి అతి పెద్ద సంఘంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి అలుపెరగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపునకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

అనంతరం యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పి.రమణ, డి పైడిమల్లు, గౌరవ అధ్యక్షులుగా మిరియాల సత్యవతి, ఉపాధ్యక్షులుగా పీవీ సుబ్బారావు, టీవీఎల్ ప్రసన్న, కోశాధికారిగా కె.శ్రీను, ఎఫ్‌డబ్ల్యు కార్యదర్శిగా బి.శ్రీను, పత్రికా కార్యదర్శిగా కె శ్రీను, మండల ఆడిటర్‌గా ఎ.సతీష్, కార్యదర్శులుగా జి త్రినాథ్, బి మురళీకృష్ణ, ఎం రాజబాబు, ఈ బాపూజీ, జె రాంబాబు, ఎస్ విజయ్ కుమారి తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, పి.మంగరాజు, ఉదయ్ ఉపాధ్యాయులు శాంతి పాప, లక్ష్మీబాయి, ఆర్ లక్ష్మి, రమణ, వెంకటలక్ష్మి, సత్యవతి, జి అప్పారావు, జి ఝూన్సీ రాణి, కె లోవరాజు, సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, పైడిమల్లు


సీలేరులో షాపుల వివరాలు సేకరణ

ఆందోళనల్లో వర్తకులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరులో రెవెన్యూ సిబ్బంది బుధవారం మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న వర్తకుల షాపులు వివరాలను సేకరించారు. దీంతో షాపులు యజమానుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న పార్వతి నగర్ వద్ద 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వం ఏపీ జెన్కో అధికారులకు చర్యలు వేగవంతం చేసి కార్యచరణ రూపొందించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 1న సీలేరులో తలపెట్టబోయే ప్రజాభిప్రాయ సేకరణకు దారకొండ, గుమ్మరేవులు, బొడ్డగండి, బూసి కొండ తదితర గ్రామాల ప్రజలకు ఎపి జెన్‌కో అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. దీంతో సీలేరులో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మిస్తే దుకాణ సముదాయాలు కోల్పోతామని వర్తకుల్లో ఆందోళన నెలకొంది. రెవెన్యూ అధికారులు బుధవారం సీలేరు సచివాలయాన్ని చేరుకొని దుకాణాల యజమానులు పేర్లు నమోదు చేయడంతో వీరిలో మరింత ఆందోళన పెరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నప్పుడు 1964లో సీలేరు ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఒడిశా, కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాల నుంచి బతుకుతెరువు కోసం వచ్చి కొంతమంది ఇక్కడి స్థిరపడ్డారు. మరి కొంతమంది వ్యాపారాలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అప్పట్లో ఏపీ జెన్‌కో అధికారులు వ్యాపారులకు దుకాణ సముదాయానికి స్థలాలు కేటాయించారు. ఆ స్థలాల్లో దుకాణాలు నిర్మించుకొని ఉపాధి పొందుతున్నారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు కోసం ఇటీవల నిర్వహించిన సర్వేలో మార్కెట్ ప్రాంతానికి దగ్గరలో ఏడో క్రాస్ రోడ్ పంచాయతీ సమీపంలో సర్వే రాళ్ల ఏర్పాటు చేయడంతో స్థానికులు మరింత ఆందోళన చెందుతున్నారు. దుకాణాలు వివరాలు ఎందుకోసం సేకరిస్తున్నారని విఆర్వో శ్రీనివాస్‌ను స్థానిక వ్యాపారులు వివరణ కోరగా తహశీల్దార్ ఆదేశాల మేరకు సేకరిస్తున్నామని వెల్లడించారు. దీనిపై తహశీల్దారు రాజకుమార్‌ను వివరణ కోరగా గిరిజనేతరులు లాడ్జిలు, దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు అందజేయని, ఉన్నతాధికారి ఆదేశాల మేరకు వివరాలు సేకరిస్తున్నామని, పంపు స్టోరేజ్ కోసం కాదని, ప్రజలు వర్తకులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.



దుకాణాల యజమానుల వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఐటిడిఎ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ్రమ పాఠశాలల వర్కర్లు

ముఖ హాజరుపై నిరసన

ఆర్థిక స్థోమత, నైపుణ్యం లేని వారికి మినహాయింపు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసే అర్థిక స్థోమత, వాటిని ఉపయోగించే నైపుణ్యం లేని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కుక్, కమాటి, వాచ్‌మెన్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ముఖ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని బుధవారం చింతూరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం ముఖ హాజరు ప్రవేశ పెట్టడంతో చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల పరిధిలోన ఆశ్రమ పాఠశాలల వర్కర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సిబ్బందే పని చేయాల్సి వస్తుందని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కరు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు వేతనాలు పెంచాలని, సీనియార్టీ ప్రకారం వర్కర్లను క్రమబద్ధీకరించాలని, కళాశాల హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లను అవుట్ సోర్సింగ్‌లోకి మార్చాలని కోరారు. యూనిఫారం, ఇతర రక్షణ పరికరాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, డ్యూటీ చేస్తూ చనిపోయిన వర్కర్లకు జీవో ప్రకారం రూ.2 లక్షలు చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ఆశ్రమ స్కూల్స్ వర్కర్లు కారం చంద్రమ్మ, దుర్గారావు, వీరాస్వామి, చెల్లమ్మ, రాములమ్మ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణ మందులు వేస్తున్న సిబ్బంది

డెంగీ కలకలంతో వైద్య సిబ్బంది అప్రమత్తం

ఫీవర్ స్క్రీనింగ్, దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో డెంగీ కేసు నమోదు కావడంతో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆరోగ్య సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది కలిసి గ్రామంలో ఫీవర్ స్క్రీనింగ్ చేశారు. మురికి గుంతలు, కాలువల్లో దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు ఎస్‌కె.ఖాదర్ మస్తాన్, సౌమ్య డెంగీ, మలేరియా, మెదడువాపు, ఇతర వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డెంగీ వ్యాధితో బాధపడుతున్న కిల్లో పార్వతి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. మురికిగుంతలు, కాలువలు వల్ల దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, ఈ దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. అందువల్ల గ్రామాల్లోనూ, ఇంటి పరిసరాల్లోనూ గోతులుంటే పూర్చాలని సూచించారు. ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ వ్యాధుల పట్ల గిరిజనులు అవగాహన కల్పించుకోవాలన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ స్ప్రేయింగ్ 3 రోజుల పాటు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ ఎం.శ్రావణి, ఏఎన్ఎం దేవి, ఆశ కార్యకర్తలు సంగీత, కరుణ, మణి, దొయమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పప్పుల పండుగ

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని పెద్ద గెద్దాడ గ్రామంలో బుధవారం పప్పుల పండుగను ఘనంగా నిర్వహించారు. రైతులు తమ పొలాల్లో పండిన పంటలతో వంటలు చేసి గ్రామదేవతకు నైవేధ్యంగా సమర్పించారు. పసుపు కుంకుమలతో పూజలు చేశారు. గ్రామం మధ్యలో యువతి యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజనులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉందని మంప ఎస్ఐ లోకేష్ అన్నారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన బూదరాళ్ల, యు.చీడిపాలెం పంచాయతీల పరిధిలోని పొకల పాలెం, కునుకూరు, కన్నవరం నల్లబెల్లి, గోధుమ లంక, రాజులపాడు, బొడ్డు మామిడి, ఉత్తంజోల, మర్రిపాకలు, జెర్రి గొంది తదితర గ్రామాల్లో పోలీసులు బుధవారం సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు,. రవాణా వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం గిరిజనులకు కావాల్సిన మందులు, యువతకు వాలీబాల్ కిట్లు, పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



గిరిజనులకు మందులు అందజేస్తున్న ఎస్ఐ లోకేష్ తదితరులు

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి...

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, వాటి పరిష్కారానికి పోరాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, రింగ్ రోడ్, బెల్లం మార్కెట్ తదితర ప్రాంతాల్లో వాకర్సను కలిసి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీతో పాటు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ప్రజా సంఘాల నాయకులు సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిశారు. పలు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు వంత పాడుతున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని చెప్పారు. 250 ప్రజా సంఘాల బలపర్చుతున్న కోరెడ్ల రమాప్రభ ఉత్తరాంధ్ర ప్రజలు గొంతై ఇక్కడి సమస్యలపై గళమెత్తుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, గంట సురేష్, ఎస్ రమణ, గొర్లి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. మండలం లో బుధవారం పలు గ్రామాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమా ప్రభను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసనమండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపైన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తమ గళాన్ని వినిపిస్తున్నారన్నారు. శాసనమండలి సభ్యులకు ఇచ్చిన కోట్లాది రూపాయలు విలువ చేసే ఇల్లు, స్థలాలను పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు తిరస్కరించి, రాష్ట్రంలో ఇల్లు, స్థలాలు లేని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశామని తెలిపారు. విలువలకు, నిబద్ధతకు కట్టుబడి పని చేస్తున్నామన్నారు. పట్టభద్రులు అందరూ ఆలోచించి పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, బి.అప్పలరాజు, కె.కాశీ, ఎం.జాన్, ఎం.బాపూజీ, అంజి, అప్పలరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రజాసంఘాల ప్రతినిధులు తగరపువలసలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, కరపత్రాలను అందజేసి, రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ మండలంలోని హరిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రజాసంఘాల ప్రతినిధులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు కె. రామసవాశివరావు ఎస్ కనుమునాయుడు, ఎం సూర్య రామ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా బుధవారం అచ్చుతాపురంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమ నాయుడు ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులను నిరుద్యోగులను ఉద్యోగులను కార్మికులను కలిశారు. పిడిఎఫ్ బలపరిచిన రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

డుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టబద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అరకు పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై శాసనమండలిలో గొంతిత్తి ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.సురేష్ కుమార్, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిసి అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు





అచ్యుతాపురం మండలంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



తగరపువలసలో ప్రచారం చేస్తున్న సిఐటియు నేతలు



ఉత్తీర్ణత సాధించిన యువత

ఎస్ఐ ప్రిలిమ్స్‌లో గిరిజన యువత సత్తా

మెయిన్స్‌కు అర్హత సాధించిన 24 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉద్యోగ పోటీ పరీక్షల్లో గిరిజన యువత మరోసారి సత్తా చాటారు. విశాఖ వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)లో ఐటిడిఎ ఆధ్వర్యంలో పిఒ రోణంకి గోపాలక్రిష్ణ కృషితో అందిస్తున్న ఉద్యోగ పోటీ పరీక్షల శిక్షణను సద్వినియోగం చేసుకొని గిరి పుత్రులు ఆయా ఉద్యోగ పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆయా పోటీ పరీక్షలతో పాటు గ్రూప్-1 పరీక్షలో 12 మంది గిరిజన యువత అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విషయం విధితమే. తాజాగా మంగళవారం వెలువడిన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలో 24 మంది గిరిజన యువత శతశాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి వారి ఘనతను చాటుకున్నారు. ఎపి పోలీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న వారిలో 24 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 24 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు.

పిఒ అభినందన

ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి మెయిన్స్‌కు అర్హత సాధించిన గిరిజన యువతకు పిఒ అభినందనలు తెలియజేశారు. మెయిన్స్‌లో కూడా మంచి ర్యాంకులు సాధించి ఐటిడిఎకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. గిరిజన యువత భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎవరూ ఎటువంటి నిరాశ నిస్పృహకు లోను కాకుండా పట్టుదలతో చదవాలని, ఐటిడిఎ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు హాజరైన 24 మంది మెయిన్స్ కు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. వీరు చూపిస్తున్న ప్రతిభ భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించే సామర్థ్యం, సత్తా గిరిజన విద్యార్థుల్లో ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు ఐటిడిఎ ఆధ్వర్యంలో 21వ సెంచరీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ అందిస్తున్న శిక్షణ గిరిజన యువతకు ఎంతో దోహదపడుతుందని సంస్థ నిర్వాహకురాలు ధరణి పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి ఓట్లు అడిగే హక్కు లేదు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు అడిగే నైతిక హక్కు లేదు అధికార వైసిపికి లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్లలో రాష్ట్రానికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు వైసిపి ఏమి చేసిందని ఓటర్లు ప్రశ్నించాలన్నారు. 2020 జనవరి 24న శాసనసభలో శాసన మండలి రద్దు అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. అటువంటప్పుడు శాసన మండలికి పోటీ చేసే నైతిక హక్కు, ఓటు అడిగే హక్కు వైసీపీకి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. జగన్‌కి ఓటమి భయం పట్టుకుందని, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదరి అప్పలరాజు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల కాళ్లకు మొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఐకాన్‌గా ఉన్న ఆంధ్ర యూనివర్సిటీని విసి ప్రసాదరెడ్డి వైసిపి కార్యాలయంగా మార్చేశారని ఆరోపించారు. ఎయు విసి ప్రసాదరెడ్డి, రాయలసీమలో ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి విద్యా సంస్థల నిర్వాహకులను, విద్యార్థులను బెదిరిస్తున్నారని తెలిపారు.

వైసిపి హయాంలో లులు గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్ టెన్, టైటాన్ ఎలక్ట్రానిక్స్, ఆధాని డేటా సెంటర్, ఫింటెక్ వలీ, మిలీనియం టవర్స్ వెనక్కి వెళ్లాయని విమర్శించారు. పరిపాలన రాజధాని అని చెప్పి రూ.వేల కోట్ల విలువైన ఆశ్రమం భూములు, దసపల్లా భూములు, బే పార్క్ భూములను విజయసాయిరెడ్డి దోచేశారని ఆరోపించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. బుధవారం నాటికి ప్రధాన వేదికలన్నింటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలూ శ్రమిస్తున్నారు. గురువారం సాయంత్రం నాటికి అన్ని ప్రధాన వేదికలూ అందుబాటులోకి వచ్చేస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణలో భాగంగా రూ.100 కోట్లతో నగరంలోని రోడ్లను సుందరీకరిస్తున్నామని వెల్లడించారు.

26 దేశాల నుంచి అతిరథ మహారథులు

సదస్సుకు 26 దేశాల నుంచి అతిథులు, పెట్టుబడిదారులు విచ్చేస్తున్నారు. ఈ మేరకు నగరంలో ఉన్న పలు హోటళ్లలో 750 పై చిలుకు గదులను ఇప్పటికే కేటాయించారు. ఇవి కాకుండా మరో వెయ్యి వరకు ప్రయివేటుగా కొంతమంది గదులను బుక్ చేసుకున్నారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కళాశాల మైదానంలో పెట్టుబడిదారులు వచ్చే మెయిన్ ప్రవేశ ద్వారం వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటుచేశారు. 40 డెస్కులను ఏర్పాటు చేశారు. అందుకు తగ్గ నోడల్ అధికారులను, సిబ్బందిని కేటాయించారు. ఈ మేరకు బుధవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు పరిశ్రమల శాఖ ఈడీ చెప్పారు.

ఎపి పెవిలియన్ పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్

ముఖ్యమంత్రికి కేటాయించిన ప్రత్యేక వేదికకు సమీపంలో ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మద్దిలపాలెం వైపు సుమారు 137 స్టాళ్లతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు.

గాయపడిన తాపీ మేస్త్రీలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి-అడ్డతీగల

పలు ప్రమాదాల్లో గాయపడిన తాపీ మేస్త్రీలకు స్థానిక వినాయక తాపీ పనివారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం పంపిణీ చేశారు. సంఘం సమావేశంలో చేసిన తీర్మానం మేరకు అధ్యక్షులు నక్క పెంటారావు, కార్యదర్శి సురేష్ బాబు ఆధ్వర్యంలో బాధితులు జమ్మి సూరిబాబు, వేణు బాబురావు, పసుపులేటి సూరిబాబు, లింగం వీరబాబు తదితరులకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి నిధులను నిలుపుదల చేయడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వారికి కార్మికులకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంక్షేమ నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చీకట్ల శామ్యూల్, చింతాజీ అబ్బులు, నిమ్మగడ్డ కొండబాబు, చాగంటి ఆదినారాయణ, లింగం పెద్ద కాపు కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఆర్‌టితో కేన్సర్‌కు చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఒమెగా ఆసుపత్రిలో విజన్ ఆర్‌టి (సర్ఫేస్ గైడెడ్ సిస్టమ్) ఉపయోగించి రెండు వేల మంది కేన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్సను అందించినట్టు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. బుధవారం ఆరిలోవ హెల్త్‌సిటీ ఒమెగా ఆసుపత్రిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రపంచస్థాయి సదుపాయాలతో, అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కేన్సర్‌కు చికిత్సను అందించడంలో విశాఖపట్నం ఒమెగా ఆసుపత్రి అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌జిఆర్‌టి విధానాన్ని తొలిసారి అందుబాటులోకి తెచ్చింది ఒమెగా ఆసుపత్రి అన్నారు. సాధారణ విధానం వల్ల కలిగే అసౌకర్యాన్ని, బాధను తగ్గించవచ్చన్నారు. ఈ విధానం ఆర్టిఫిషియన్ ఇంటిలిజెన్స్ ద్వారా పనిచేస్తుందన్నారు. ప్రత్యేమైన వీడియో మోడ్ విధానంలో రోగి కదలికలను గమనిస్తూ చికిత్స అందిస్తామన్నారు. ఈ విధానంలోని 3డి రియలిస్టిక్ ఫొటో క్యాప్చర్ ఫీచర్ వలన ఉప మిల్లీమీటర్ కచ్చితత్వంతో రోగికి చికిత్స చేయవచ్చన్నారు. రొమ్ము కేన్సర్ రోగులలో గుండెపైనా, అలాగే, పిల్లలకు చికిత్సను సజావుగా అందించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు. మెదడులోని చాలా చిన్న కణితులను కూడా స్టీరియోటాక్టిక్ రేడియేషన్ ద్వారా చికిత్స చేయుట సులభమైందన్నారు. సమావేశంలో వైద్యనిపుణులు డాక్టర్ లక్ష్మీనరసింహ, కృష్ణరమేష్, జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఆనంద్‌కృష్ణన్ పాల్గొన్నారు.

రైల్వే సంబంధిత సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కంచరపాలెం : పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని రైల్వే సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వైసిపి పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు బృందంగా వెళ్లి ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డిఆర్ఎం అనూప్‌కుమార్ శతపతి స్పందిస్తూ, సంబంధిత సమస్యలపై ఆయా శాఖాధిపతులతో చర్చించి, సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. దీనిపై ఈ నెల 4న క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి, నివేదిక, పరిష్కార చర్యలను సూచించాల్సిందిగా సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అమర్, బుగ్గన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 కు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, ఇతర అధికారులతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి బయలుదేరి ఎన్ఎడి మీదుగా తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి బ్రిడ్జ్ మీదుగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించనున్న ఎయు మైదానానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి ఆయన సిపితో చర్చించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. అక్కడ నుంచి అతిథులు బస చేసే రాడిసన్ బ్లూ హోటల్‌ను పరిశీలించి ఏర్పాట్లపై పోలీసు కమిషనర్‌తో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమ్మిట్‌తో విశాఖ ఖ్యాతి విశ్వవిఖ్యాతం

ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌తో విశాఖ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పబోతున్నామని నెడ్ కేప్ చైర్మన్ కెకె.రాజు తెలిపారు. వైసిపి నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం రాజధానిగా మారడానికి అన్ని లక్షణాలను కలిగి ఉందన్నారు.

నేడు ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం రాత్రి 8 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారని అమర్‌నాథ్ తెలిపారు. 3వ తేదీ ఉదయం ఆయన వేదిక వద్దకు వచ్చి, ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారని, అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తారన్నారు. తొలిరోజు కొన్ని ఎంఒయులు జరుగుతాయని వివరించారు. ఏర్పాట్లను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం పరిశీలించారు.

మూడు రోజులు విశాఖలోనే

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చే ముఖ్యమంత్రి ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ మధ్యాహ్నం వరకూ విశాఖలోనే బస చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలను అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం 2వ తేది సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అనంతరం రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో రాత్రికి బస చేస్తారు. 3వ తేది ఉదయం 8:50 గంటలకు హోటల్ నుంచి బయలుదేరి ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొంటారు. రాత్రి 8.00 నుంచి 9.00 గంటల మధ్య ఎంజీఎం పార్క్ హోటల్‌లో జిఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటుచేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాడిసన్ బ్లూ హోటల్‌లో బస చేస్తారు. 4వ తేదీ ఉదయం 9.10 గంటలకు సదస్సు ప్రాంతానికి చేరుకొని సమ్మిట్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 3.40 గంటలకు తాడేపల్లి నివాసానికి

ఏర్పాట్లను అమర్‌నాథ్ పరిశీలన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సంబంధించి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్లో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 3, 4 తేదీలలో జరగనున్న పారిశ్రామిక సదస్సుకు ఇప్పటివరకు 25 ప్రత్యేక విమానాలు విశాఖకు రాబోతున్నాయన్న సమాచారం అందిందని, 18 విమానాలను విశాఖ ఎయిర్ పోర్టులో పార్క్ చేసే అవకాశం ఉందని, మిగిలిన విమానాలు రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు తరలించనున్నామని చెప్పారు. విశాఖకు తరలివస్తున్న ప్రముఖుల్లో అంబానీ, కరణ్ అదానీ, కుమార్ మంగళం బిర్లా తదితరులు ఉన్నారని తెలియజేశారు. ఈ సదస్సులో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో అత్యధిక పెట్టుబడులు వచ్చే అవకాశముందని తెలిపారు.

చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం ఏపీ జెన్కో ఎడిఇ టెక్నికల్‌గా విధులు నిర్వహిస్తూ విఆర్ఎస్ తీసుకున్న చంద్రశేఖర్‌ను బుధవారం ఎస్ఇ కార్యాలయంలో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్ సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ కార్యాలయంలో ఎడిఇ టెక్నికల్‌గా విధులు నిర్వహించేవారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలవంచలో విధులు నిర్వహించేవారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఆంధ్రకు ఏపీ జెన్కో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ క్రమంలో 2020 జులైలో సీలేరు కాంప్లెక్స్‌లో ఏడీఈ టెక్నికల్‌గా చంద్రశేఖర్ విధులు చేపట్టారు. ఇంకా రెండేళ్ల సర్వీసు ఉన్నా ఆరోగ్య కారణాల రీత్యా విఆర్ఎస్ పెట్టుకొని ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏడిఈ అప్పలనాయుడు, ఏఈలు కృష్ణారావు, సురేష్, పావని పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఎస్ఇ ప్రశ్శాంత్‌కుమార్, తదితరులు

మొక్కజొన్న సాగు, సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం దాకమర్రిలో మొక్కజొన్న సాగు, సస్యరక్షణకు చేపడుతున్న చర్యలపై వ్యవసాయశాఖ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. విశాఖ డాట్ శాస్త్రవేత్త డాక్టర్ బి భవాని, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, డిఆర్‌సి, ఎడిఎ, చదువుల సుబ్రమణ్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివకోమలి పరిశీలించారు. ఈసందర్భంగా మొక్కజొన్న పంటకు ఆకు ఎండు తెగులు (లీఫ్ బ్లైట్) ఎక్కువగా సోకినట్లు గుర్తించారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 5ఇసి 400ఎంఎల్, లేదా ప్రోపికొనజోన్ 25ఇసి 200 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి మందు ద్రావణాన్ని మొక్కజొన్న పైర్లపై పిచికారీ చేయాలని సూచించారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా పరిగణించిన నేపథ్యంలో ప్రస్తుత రబీలో మొక్కజొన్న పంట కోత తర్వాత, రానున్న ఖరీఫ్ వరి పంట ముందే రాగి పంటను వేసుకుని అధిక ఆదాయం పొందాలని రైతులకు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో దాకమర్రి విహెచ్ఎ, భాగ్య రేఖ, ఆర్‌బికె వాలంటీర్ సి హెచ్ యోన తది తరులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు వాటర్ క్యాన్ల వితరణ

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం, సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నాలుగు వాటర్ క్యాన్లను స్థానిక సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ డే కార్యక్రమం రోజు తాను పాఠశాలను సందర్శించి నప్పుడు మంచినీళ్లు సేవించడానికి, నిల్వ ఉంచేందుకు సామాగ్రి కొరత ఉన్నట్లు గమనించినట్లు చెప్పారు. వచ్చే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాలుగు వాటర్ క్యాన్లు అందజేసినట్లు చెప్పారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఇప్పటినుంచే టెన్త్ విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



వాటర్ క్యాన్లను అందజేస్తున్న సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ సురేష్